

డబుల్ డ్యూటీ కష్టాలు..
ఆర్టీసీ భద్రాచలం డిపోలో కండక్టర్ లేకుండా టిమ్‌తో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు రెండు పనులతో ఇబ్బంది పడుతున్నారు. 8లో



కమ్యూనిజానికి అంతం లేదు
కమ్యూనిజానికి అంతం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
31° / 24°
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రమణీయం.. రామయ్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పారాయణదారులకు ఉచిత వసతి, భోజనం
రామాలయంలో ఈనెల 23 నుంచి జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రామాయణ పారాయణం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏటా మాదిరిగానే 108 మందిని ఎంపిక చేసినట్లు ఈఓ దామోదర్ రావు తెలిపారు. వీరికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజు

బూర్గంపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ పథకంపై ప్రతిస్పందనాత్మక పాలనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నకిరిపేట, కృష్ణసాగర్, ఉప్పుసాక గ్రామాల గిరిజనుల వివరాలు సేకరించాలని మండల లెవెల్ కమిటీ సభ్యులకు సూచించారు. ప్రతీ గ్రామంలో ఎన్జీఓల సహకారంతో అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పథకాల గురించి గిరిజనులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, అధికారులు నాగరాజు, రవి, ఉషారాణి, రాంబాబు, జగదాంబ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్య తప్పదు

కొత్తగూడెంఅర్బన్: అక్రమంగా అబార్షన్లు నిర్వహించొద్దని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో సిజేరియన్లు (సీ సెక్షన్లు)ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశమన్నారు. అత్యవసరమైతేనే సీ సెక్షన్లు నిర్వహించాలని, తల్లీ పిల్లల ఆ రోగ్య సంరక్షణకు సాధారణ ప్రసవాలనే ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు స్పందన, మధువరణ్, ప్రసాద్, తేజశ్రీ, ఫైజ్‌మొహియుద్దీన్ పాల్గొన్నారు.

డీఈఓగా నాగలక్ష్మి కొనసాగింపు

చుంచుపల్లి: జిల్లా విద్యాశాఖధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన మరోసారి విముఖత వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుతం డీఈఓ బాధ్యతలు చూస్తున్న జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి తిరిగి కొనసాగనున్నారు. డీఈఓ వెంకటేశ్వరాచారి జూలైలో ఉద్యోగ విరమణ పొందగా.. ఆ స్థానంలో విద్యాచందనకు బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నిర్ణయించగా ఆమె విముఖత వ్యక్తం చేశారు. దీంతో ఆగస్టు 4న నాగలక్ష్మికి ఆ బాధ్యతలు అప్పగించారు. అయితే విద్యాచందనకు డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆమె డీఈఓ బాధ్యతలు చేపడతారనే ప్రచారం సాగింది. కానీ ఆమె కలెక్టర్‌ను కలిసి ప్రస్తుతం తాను చూస్తున్న బాధ్యతలను వివరించి, డీఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టలేనని చెప్పినట్టు తెలిసింది. దీంతో నాగలక్ష్మినే డీఈఓగా కొనసాగించనున్నారు.

‘సమ్మక్క’ చిక్కులు సీతారామ తీర్చేనా?


మధ్యలోనే పనులు నిలిచిపోయిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు

సమ్మక్క సాగర్ కింద ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణపై అభ్యంతరాలు
- కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు చూపాలని సూచన
- సీతారామ రీడిజైన్‌తో ఇల్లెందు, మహబూబాబాద్‌కు మొండిచేయి
- సమ్మక్క సాగర్ కొత్త ఆయకట్టుగా ఈ రెండింటినీ చూపాలంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని బీడు భూములకు గోదావరి జలాలు అందించేందుకు జే చొక్కారావు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ రెండు పథకాల కింద గోదావరి నదిపై ములుగు జిల్లాలో సమ్మక్క సాగర్, భద్రాద్రి జిల్లాలో సీతమ్మసాగర్ బరాజ్‌లను నిర్మిస్తోంది. ఇప్పటికే సమ్మక్క బరాజ్ పనులు 95 శాతం పూర్తి కాగా సీతమ్మ సాగర్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. అయితే ఈ రెండు బరాజ్‌లకు సంబంధించిన డిజైన్లు, ఆయకట్టు తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదిక (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)కు ఇప్పటివరకు కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు రాలేదు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా కృషి చేస్తోంది.

సమ్మక్క బరాజ్‌కు కొర్రీలు..
సమ్మక్క బరాజ్‌కు సంబంధించి సీడబ్ల్యూసీకి సమర్పించిన డీపీఆర్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ కింద ఉన్న 4.40లక్షల ఆయకట్టును స్థిరీకరిస్తామని పేర్కొన్నారు. మరోవైపు ఇదే ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లోనూ ప్రభుత్వం చూపించింది. దీంతో ఒకే ఆయకట్టును రెండు ప్రాజెక్టుల కింద చూపడంపై సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టుకే పరిమితం చేస్తే సమ్మక్క బరాజ్‌కు సంబంధించిన ప్రాజెక్టు ప్రయోజనాల వ్యయం (కాస్ట్ బెనిఫిట్ రేషియో) తగ్గుతోంది. ప్రస్తుత డీపీఆర్‌లో ఒక రూపాయి ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేస్తే కొత్త పాత ఆయకట్టుల ద్వారా రూ.1.67 లాభం వస్తుందని తెలిపారు. కానీ ఎస్సారెస్పీ ఆయకట్టును తొలగిస్తే రూపాయి ఖర్చుకు రూపాయి మేరకు కూడా ప్రయోజనం కనిపించడం లేదు. దీంతో సమ్మక్క బరాజ్ కింద కొత్తగా రెండు లక్షల ఆయకట్టును చూపాలంటూ కేంద్ర జల సంఘం సూచించింది.

రీడిజైన్‌తో అన్యాయం..
ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. అయితే కిన్నెరసాని అభయారణ్యం కారణంగా అనుమతులు రావడంలో ఆలస్యం జరుగుతోందంటూ ఈ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. దీంతో ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లోని బీడు భూములకు గోదావరి నుంచి చుక్క నీరందే పరిస్థితి లేదు. కొత్తగూడెం, వైరా, ఖమ్మం నియోజకవర్గాలకు కూడా పాక్షికంగానే అందుతోంది.

ఉభయతారకంగా..
గోదావరి నీటిని పాకాల మీదుగా బయ్యారం పెద్ద చెరువు, రోళ్లపాడుకు తరలించే అంశంపై మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా చేశారు. ఇప్పుడు సమ్మక్క బరాజ్ విషయంలో సీడబ్ల్యూసీ లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని సీతారామతో న్యాయం జరగని నియోజకవర్గాలను సమ్మక్క ఆయకట్టు కింద చూపే అంశాన్ని పరిశీలించాలని భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల రైతులు కోరుతున్నారు.

అడ్డంకులు లేకుండానే..
సీతారామ ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసినప్పుడు టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 16 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఈ రిజర్వాయర్ సముద్ర మట్టానికి 216 అడుగుల ఎత్తులో ఉండడంతో గ్రావిటీ ద్వారానే ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు నీరందించే వీలుంది. అలాగే కొత్తగూడెం, పినపాక, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో సీతారామ కింద ఆయకట్టు లేని మండలాలకు సాగు నీరందించే వీలుంది. అయితే గోదావరి – రోళ్లపాడు మధ్య కిన్నెరసాని అభయారణ్యం కారణంగా ఈ ప్లాన్ అటకెక్కింది. ఇప్పుడు అభయారణ్యంతో చిక్కులు లేకుండా సమ్మక్క బరాజ్ నుంచి రోళ్లపాడుకు నీరు అందించే అవకాశం ఉంది. ఇప్పటికే సమ్మక్క బరాజ్ నుంచి ఎత్తిపోసిన నీటిని రామప్ప మీదుగా పాకాల చెరువు వరకు తీసుకొస్తున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ పాకాల నుంచి మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం పెద్ద చెరువుకు, అక్కడి నుంచి రోళ్లపాడు చెరువుకు తరలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పర్యాటక హబ్‌గా నేచర్ పార్క్

- నూతన ఒరవడికి ఇల్లెందు నుంచే శ్రీకారం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి


ఇల్లెందురూరల్ : కోరగుట్ట నుంచి కిందకు వస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

ఇల్లెందురూరల్ : సుభాష్‌నగర్‌లోని అటవీశాఖ సహజ వనాన్ని(నేచర్ పార్క్) పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని, తద్వారా జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త దారులు తెరుస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అటవీశాఖ సహజ వనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పార్క్ మధ్యలోని కోరగుట్టను అధికారులతో కలిసి అధిరోహించి రోప్‌వే ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. పార్క్ సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పర్యాటకుల వినోదం, విశ్రాంతి, భద్రత అంశాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్‌లో పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఇక్కడ ఏర్పాటయ్యే స్టాళ్లు, ఫుడ్ కార్నర్లు, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సెర్ప్ అధికారులకు సూచించారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలు సహజ సిద్ధంగా అద్భుత సౌందర్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ దినేష్, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ రాంకిషన్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎఫ్‌డీఓ కరుణాకరాచారి, ఎంపీఓ చిరంజీవి, ఏఈ రాజు, ఎఫ్ఆర్ఓ చలపతిరావు పాల్గొన్నారు.

రోళ్లపాడు పాఠశాల పరిశీలన..
టేకులపల్లి: మండలంలోని రోళ్లపాడు ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, వసతి వివరాలు ఆరా తీశారు. ఒకటి, రెండో తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు తగిన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీచర్ల హాజరు, బోధనా విధానాలను అధికారులు తరచుగా పరిశీలిస్తారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు చిట్టిబాబు, పంచాయతీ సెక్రటరీ రాజు తదితరులు ఉన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ
సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోపలకు అనుమంతించొద్దని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు నోముల రమేష్, లక్ష్మణ్ అగర్వాల్, రాంబాబు, సలిగంటి శ్రీను, ఎస్‌కే సలీం ఉన్నారు.

కాళోజీ సేవలు చిరస్మరణీయం

జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన


ఐడీఓసీలో నివాళులర్పిస్తున్న విద్యాచందన తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణసాహిత్యం, సంస్కృతి, భాషలకు కాళోజీ చిరస్థాయి గుర్తింపు తెచ్చిపెట్టారని కొనియాడారు. ఆయన కవి మాత్రమే కాదని, సామాజిక ఉద్యమకారుడిగా, ప్రజా చైతన్యవేత్తగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారని వివరించారు. భావితరాలకు ఆయన రచనలు ధైర్యాన్ని, సామాజిక అవగాహనను కలిగిస్తాయని చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించిందని వివరించారు. కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, కలెక్టరేట్ ఏఓ అనంతరామకృష్ణ, ఓఎస్‌డీ వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, బీసీ సంక్షేమాధికారి విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి పాల్గొన్నారు.

కాళోజీ రచనలు స్ఫూర్తిదాయకం
భద్రాచలం : కాళోజీ నారాయణరావు రచనలు నవ సమాజ నిర్మాణానికి, నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కాళోజీ రచనలు సాగాయన్నారు. ఆయనను స్ఫూర్తిగాతీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏఓ సున్నం రాంబాబు, అధికారులు సైదులు, హరికృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి మూడు ప్రాణాలు బలి

- ఓ రైతు సహా ఇద్దరు కూలీలు దుర్మరణం
- మిషన్ భగీరథ ట్యాంకులో ఊపిరాడక ప్రమాదం


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చర్ల: నిర్మాణ సమయాన ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. వివరాలిలా.. చర్ల మండలం ఉంజుపల్లిలో రూ.29 లక్షల వ్యయంతో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మిస్తుండగా అధికారులు ఈ పనిని సోనీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు అప్పగించారు. కాగా, మంగళవారం స్లాబ్ పనులు చేస్తున్న క్రమంలో ట్యాంక్‌లోని నీటిని బయటకు తోడేందుకు డీజిల్ మోటార్ ఏర్పాటు చేశారు. మోటార్‌లో డీజిల్, ట్యాంక్‌లో ఏర్పాటుచేసిన సెంట్రింగ్ కర్రలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించేందుకు మొదట లింగాపురంపాడు గ్రామానికి చెందిన నీలం తులసీరాం(38) ట్యాంక్‌లోకి దిగాడు. అయన ఎంతసేపటికీ రాకపోవడంతో ఏపీలోని తణుకు ప్రాంతానికి చెందిన తాటిగడప ఇస్సాకు (43), కాకినాడకు చెందిన అనునూరి అప్పలరాజు (55) ట్యాంకులోకి దిగారు. చాలాసేపటి దాకా వీరు ముగ్గురూ బయటకు రాకపోవడంతో అక్కడున్న కూలీలు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలోని పత్తి చేనులో పని చేస్తున్న ఉంజుపల్లికి చెందిన కాకా మహేష్(38) కూడా ట్యాంక్‌లోకి దిగాడు. వీరు నలుగురూ అందులో ఊపిరాడక స్పృహ తప్పి పడిపోవడంతో కూలీలు అతికష్టం మీద బయటకు తీసి హుటాహుటిన చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే కాక మహేష్, నీలం తులసీరాం మృతిచెందారు. అపస్మారక స్థితిలో ఉన్న అనునూరి అప్పలరాజు, తాటిగడప ఇస్సాకును వేర్వేరు అంబులెన్సుల్లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇస్సాకు మరణించాడు.

గాలి, వెలుతురు లేకనే..
వాటర్ ట్యాంకుకు స్లాబ్ వేసే సమయంలో అందులో వెలుతురు ఉండేలా లైట్లు, చెడు గాలిని బయటకు పంపిస్తూ బయటి గాలి లోపలికి వెళ్లేందుకు వీలుగా ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవసరమైతే ఆక్సిజన్ సిలిండర్లు కూడా అమర్చాలి. లోపలికి దిగేవారికి కచ్చితంగా సేఫ్టీ బెల్టులు ఏర్పాటుచేయాలి. కానీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని కూలీలు ఆరోపిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, ప్రమాద స్థలాన్ని మిషన్ భగీరథ(గ్రిడ్) ఈఈ నళిని, డీఈ యేసు బాబు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రయ్య పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే కూలీలు మృతి చెందినందున వారి కుటుంబాలకు న్యాయం చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల చొప్పున పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


నీలం తులసీరాం


కాకా మహేష్


తాటిగడప ఇస్సాకు

ఎన్డీలో న్యూడెమోక్రటిక్ విలీనం

ఇల్లెందు : సీపీఐ(ఎంఎల్) ఎన్డీలో సీపీఐ(ఎంఎల్) న్యూడెక్రటిక్ రివల్యూషనరీ విలీనం అయినట్లు ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మంగళవారం ప్రకటించారు. న్యూడెమోక్రటిక్ రివల్యూషనరీ పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లాలో బలమైన ఉద్యమం కలిగి ఉందని, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు, పార్టీ పంథా, కార్యక్రమాలపై తమతో అవగాహన కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ రెండు పార్టీల విలీనంతో ఎన్డీ బలమైన పార్టీగా అవతరించిందని తెలిపారు. కాగా, ఎన్డీలో తమ పార్టీ విలీనం అయిందని న్యూడెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేక రాంరెడ్డి వెల్లడించారు.

‘డ్వాక్రా’కు కోక.. బతుకమ్మ కానుక

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రెండు చీరల చొప్పున పంపిణీ
- ఇందిరమ్మ పేరుతో అందించనున్న సర్కారు
- ఈనెల 22 నుంచి చీరలు అందించేలా ఏర్పాట్లు
- జిల్లాలో 2,16,257 మంది మహిళలకు లబ్ధి




మణుగూరుకు చేరిన ఇందిరమ్మ చీరలను దింపుతున్న సిబ్బంది (ఇన్‌సెట్) మహిళలకు పంపిణీ చేయనున్న ఇందిరమ్మ చీరలు

చుంచుపల్లి : ఈ ఏడాది బతుకమ్మ పండుగకు మహిళలకు ఇందిరమ్మ చీరలు కానుకగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అందరికీ కాకుండా పొదుపు సంఘాల సభ్యులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. ఇందిరమ్మ చీరల పేరుతో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఒక్కొక్కరికి రెండు చీరలను ఈనెల 22 నుంచి ఉచితంగా అందించనుంది. చీరల తయారీకి సిరిసిల్ల నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వగా.. సుమారు 65 లక్షల మేర చీరలు తయారవుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ బతుకమ్మ పండుగకు 18 ఏళ్ల నిండిన మహిళలకు ఒక్కో చీర అందించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేయగా.. విమర్శలు వెల్లువెత్తడంతో ఈ ఏడాది పొదుపు సంఘాల మహిళలకు చీరలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే అప్పుడు నాసిరకం చీరలు పంపిణీ చేశారంటూ వ్యతిరేకత రాగా, ఈసారి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తుండడంతో ఒక్కో చీర ధర రూ.800 వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మణుగూరుకు 17 వేలు, అశ్వారావుపేటకు 13 వేల చీరలు చేరగా, మిగితావి ఈనెల 15 నాటికి చేరతాయని అంటున్నారు.

జిల్లాలో 2,16,257 మందికి..
ఈనెల 21 నుంచి బతుకమ్మ పండుగ సంబరాలు ప్రారంభం కానుండగా మహిళలకు చీరల పంపిణీకి సర్కారు సమాయత్తమవుతోంది. బీఆర్‌ఎస్ హయాంలో రేషన్ కార్డులో పేరుండి, 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు ఒక చీర చొప్పున ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా ఈసారి స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మాత్రమే రెండేసి చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం మెప్మా, సెర్ప్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల పరిధిలోని సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 471 గ్రామ పంచాయతీల పరిధిలో 2,16,257 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్ పరిధిలో 1,82,454 మంది, మెప్మా పరిధిలో 33,803 మంది మహిళలు ఉన్నారని లెక్క తేలగా.. వీరికి రెండు చీరల చొప్పున ఇచ్చేందుకు జిల్లా అధికారులు ఇండెంట్ పంపారు. వీరందరికీ 4,32,514 చీరలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. జిల్లాకు వచ్చే ఇందిరమ్మ చీరలను నిల్వ చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట ప్రాంతాల్లో ఆరు గోదాంలను సిద్ధం చేశారు. జిల్లాలో ఈనెల 22 నుంచి 30 వరకు చీరల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాకు కేటాయించిన చీరలు, నిల్వ ఇలా..

గోదాం	కేటాయించిన చీరలు
పాత డీఆర్డీఓ ఆఫీస్(కొత్తగూడెం)	55,000
మెప్మా ఆఫీస్(మణుగూరు)	40,000
మున్సిపల్ ఆఫీస్(పాల్వంచ)	45,000
సీఆర్పీ భవనం (ఇల్లెందు)	40,000
ఎంఎస్ ఆఫీస్(భద్రాచలం)	30,000
ఎంఎస్ ఆఫీస్(అశ్వారావుపేట)	30,000

జిల్లాలోని మహిళా సంఘాలు, సభ్యుల వివరాలు

మండల సమాఖ్యలు	: 22
గ్రామ సమాఖ్యలు	: 981
స్వయం సహాయక సంఘాలు	: 22,055
సంఘాల్లోని మహిళా సభ్యులు	: 2,16,257

ఆరు గోదాంలను సిద్ధం చేశాం



జిల్లాకు వచ్చే బతుకమ్మ కానుక చీరలను నిల్వ చేసేందుకు ఆరు గోదాంలను సిద్ధం చేశాం. వీటికి ఇన్‌చార్జ్ అధికారులకు సైతం నియమించాం. ఒక్కో గోదాంలో 30 వేల నుంచి 60 వేల వరకు చీరలు నిల్వ చేస్తున్నాం. ఇప్పటికే 30వేల చీరలు చేరగా, మిగితావి మరో వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ప్రతీ మహిళా సంఘం సభ్యురాలికి రెండు చీరలు అందేలా చూస్తాం.
– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

నేడు కేటీపీఎస్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు


పాల్వంచ డీఏవీ పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న ఉద్యోగులు

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ(పాల్వంచ) ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఈ మేరకు కేటీపీఎస్‌తో పాటు బీటీపీఎస్, వైటీపీఎస్‌ల్లో ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి జి.గంగాధర్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మొత్తం 13 డైరెక్టర్ పోస్టులకు గాను 37 మంది బరిలో నిలవగా 3,003 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పాల్వంచ కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ పాఠశాలలో ఏడు, మణుగూరు బీటీపీఎస్‌లో ఎస్‌పీఎఫ్ భవనంలో రెండు, నల్లగొండ జిల్లా దామరచర్ల వైటీపీఎస్‌లోని స్పోర్ట్స్ ఆఫీస్‌లో రెండు బూత్‌లు ఏర్పాటుచేశారు. పోలింగ్ పూర్తయ్యాక బ్యాలెట్ బాక్స్‌లను పాల్వంచకు తీసుకొచ్చి ఓట్లు లెక్కించాక ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, సాధారణ ఎన్నికల మాదిరిగానే డైరెక్టర్ పోస్టులకు బరిలో నిలిచిన వారు ఉద్యోగులకు నగదు పంపిణీ చేయడమే కాక విందు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

భద్రాచలంలో ఎలక్ట్రో హెర్బల్ క్లినిక్ సీజ్



జీవధార హెర్బల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న జీవధార ఎలక్ట్రో హెర్బల్ క్లినిక్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య మంగళవారం సీజ్ చేశారు. పట్టణంలోని కూనవరం రోడ్డు సమీపంలో అనుమతులు హెర్బల్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి, వైద్యం చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓకు ఫిర్యాదులు అందాయి. ఆయన అడిషనల్ డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓను ఆస్పత్రిని సందర్శించి వివరాలు సేకరించాలని ఆదేశించారు. మంగళవారం వైద్యాధికారులు సదరు క్లినిక్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించగా డాక్టర్ రామకృష్ణ ఐదేళ్లగా ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నట్లు తేలింది. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పాయం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చదువుకునే గిరిజన గురుకుల బాలుర ప్రతిభ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేక చదువులో వెనుకబడిపోతున్నామని విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. మండలంలోని కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన బాలుర గురుకుల ప్రతిభ జూనియర్ కళాశాలలో మొత్తం 140 మంది విద్యార్థులు ఉండగా అందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 50 మంది, సెకండియర్ విద్యార్థులు 90 మంది ఉన్నారు. ఒక్క తరగతికి ఇద్దరు చొప్పున అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉండటంతో బోధన కష్టంగా మారింది. మంగళవారం కళాశాల నుంచి కిన్నెరసాని గ్రామ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, కళాశాల ఎదుట ఆందోళన చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేశ్ విద్యార్థులకు నచ్చజెప్పి తరగతి గదుల్లోకి తీసుకవెళ్లారు. కాగా, సమాచారం అందుకున్న గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి విద్యార్థుల ఆందోళనపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారం పది రోజుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

ఫ్యాక్టరీలకు సెలవు

దమ్మపేట: అశ్వారావుపేట, దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు వరుసగా రెండు రోజులపాటు సెలవులు ప్రకటించామని మేనేజర్ కల్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వారం రోజులుగా ఫ్యాక్టరీలకు పామాయిల్ గెలలు అధికంగా వచ్చాయని.. ఈ కారణంగా బుధవారం, గురువారం గెలలు కొనబోమని పేర్కొన్నారు. ఈ నెల 12 (శుక్రవారం) నుంచి గెలలు యథావిధిగా కొంటామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని దంపతుల మృతి

ఎర్రుపాలెం/కంచికచర్ల: కుమారుడి వివాహానికి ముందు ఇంట్లో కొలువైన ఉప్పలమ్మ తల్లికి పూజల తేదీ ఖరారు చేసేందుకు గురువు వద్దకు వచ్చి ఆనందంతో తిరిగి వెళ్తున్న దంపతులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. బైక్‌ను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి దామినేని కుమారి(45), శ్రీనివాసరావు(54) భార్యాభర్తలు. శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమార్తె ఉమాదేవి, కుమారుడు చంద్రశేఖర్ ఉన్నారు. కుమార్తె వివాహం తమ గ్రామానికే చెందిన సాయితో జరిపించారు. ఇక బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న చంద్రశేఖర్‌కు ఇటీవల వివాహం కుదిరింది. కుమారుడి వివాహానికి ముందు తమ ఇంట్లో వెలసిన ఉప్పలమ్మ తల్లికి పూజలు చేసేందుకు శ్రీనివాసరావు, కుమారి దంపతులు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడులో ఉన్న ఓ పూజారి వద్దకు వచ్చి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఆపై బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎర్రుపాలెం – తక్కెళ్లపాడు మధ్య ఎదురుగా వచ్చిన కోళ్ల లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతుల తలలకు తీవ్ర గాయాలై ఘటనాస్థలంలోనే మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు చంద్రశేఖర్, కుమార్తె ఉమాదేవి కన్నీటి పర్యంతమయ్యారు. కొడుకు పెళ్లి చూడకుండానే అనంత లోకాలకు వెళ్లిపోయారా అంటూ బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం అందరినీ కలిచివేసింది. కాగా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ గని ఆత్కూరులో శ్రీనివాసరావు, కుమారి మృతదేహాల వద్ద నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

‘డబుల్’ కష్టాలు..

- డబుల్ డ్యూటీలతో టిమ్ డ్రైవర్ల అవస్థలు
- పనిభారంతో సతమతం
- వారం రోజుల్లో 8 మందికి అస్వస్థత
- అదనపు డ్రైవర్ లేదా కండక్టర్‌ను ఇస్తేనే హైదరాబాద్ వెళ్తామంటున్న డ్రైవర్లు





విధులు బహిష్కరించి డిపోలోనే ఉన్న టిమ్ డ్రైవర్లు (ఇన్‌సెట్) బస్సులో టిమ్ ద్వారా టికెట్ ఇస్తున్న డ్రైవర్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్ లేకుండా టికెట్ ఇష్యూ మిషన్ (టిమ్)తో డ్రైవింగ్ చేస్తున్నవారి పరిస్థితి అధ్వానంగా మారింది. డబుల్ డ్యూటీ (కండక్టర్, డ్రైవర్) చేయాలంటే ఇబ్బందిగా ఉందని, ఏకాగ్రత కోల్పోతున్నామని వారు తెలిపారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు వెళ్లే టిమ్ సర్వీసులకు అదనపు డ్రైవర్ లేదా కండక్టర్‌ను ఇస్తే కానీ వెళ్లమని సోమవారం డ్రైవర్లు విధులను బహిష్కరించారు. సుమారు 10 సర్వీసులకు టిమ్ డ్రైవర్లు వెళ్లకుండా డిపో వద్దే ఉన్నారు. ఈ సర్వీసులతో తాము తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని, అనారోగ్యం పాలవుతున్నామని వాపోయారు. ఇప్పటికే వారం రోజులుగా 8 మంది సర్వీసులకు వెళ్లివచ్చి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారని, ఇప్పటికే ఆర్టీసీ డీఎం తిరుపతికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని చెబుతున్నారు. డ్రైవర్లు వెళ్లకపోవడంతో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల వరకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన బస్సులు ఆగిపోయాయి. మోటార్ వాహనాల చట్టం ప్రకారం ఒక డ్రైవర్ ఆరున్నర గంటలు నిరంతరాయంగా పనిచేసిన తర్వాత ఎనిమిది గంటలు విశ్రాంతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని టిమ్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. పలు కేసుల్లో కోర్టు చుట్టూ తిరుగుతున్న వ్యక్తిని సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించడంపై ఆర్టీసీ కార్మికులు మండిపడుతున్నారు. తమ సమస్యను పరిష్కరించే వరకు విధులు బహిష్కరించి డిపోలోనే ఉంటామని చెబుతున్నారు.

మానసిక ఒత్తిడితో ప్రమాదాలు..

కండక్టర్ లేకుండా టికెట్లు ఇచ్చుకుంటూ.. ప్రయాణికులను పర్యవేక్షిస్తూ.. లోపల పరిశీలిస్తూ బస్సు నడపాలంటే భయపడుతున్నారు. అందరూ టికెట్ తీసుకున్నారా? లేదా? అని, దిగాల్సిన ప్రయాణికులను చూసుకుంటూ పనిచేయాలంటే ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. బస్సు నడిపే సమయంలో ఒత్తిడికి గురైతే ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

టిమ్‌తో ఇబ్బందులు ఇవే..

భద్రాచలం డిపో పరిధిలో 101 బస్సు సర్వీసులు నడుస్తుండగా, ఇందులో 79 ప్రభుత్వ బస్సులు కాగా, 22 ప్రైవేట్ బస్సులున్నాయి. వీటిల్లో టిమ్ (టిక్కెట్ ఇష్యూ మిషన్) డ్రైవర్లు పనిచేసే 25 బస్సులున్నాయి. డిపో పరిధిలో ఉన్న బస్సులకు 185 మంది డ్రైవర్లతోపాటు 163 మంది కండక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలం డిపో నుంచి హైదరాబాద్‌కు–17, మంచిర్యాల–3, తిరుపతి–1, శ్రీశైలం–1, విజయవాడ–1, విశాఖపట్నం–2 టిమ్ బస్సులను నడుపుతున్నారు. బస్టాండ్‌లో నిలిపి టిక్కెట్ కొట్టడం వల్ల ప్రయాణానికి ఆలస్యమవుతోంది. టికెట్ మరిచిపోతే ఉద్యోగం ఎక్కడ పోతుందోనన్న ఆందోళన ఉంటోందని, ప్రయాణికుడు టికెట్ తీసుకోకపోయినా డ్రైవర్‌పై క్రమశిక్షణ చర్యలు ఉంటున్నాయని, బస్సు ఎక్కడైనా దెబ్బతిన్నా డ్రైవర్లే ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. డ్రైవింగ్‌పై ఏకాగ్రత కోల్పోతున్నామని, ఉద్యోగ భద్రతకు గ్యారెంటీ ఉండదని పేర్కొంటున్నారు. డ్రైవరు ఒక్కరే ఉండటం వల్ల లగేజీ ఏం వేస్తున్నారో చూసుకోవడం కష్టమని చెబుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఆర్టీసీ డ్రైవర్లు టిమ్ సర్వీసులు నడపాలనే ఆదేశాలు ఉన్నతాధికారుల నుంచి వచ్చాయి. అది నా పరిధిలో ఉండేది కాదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే మేము నడుచుకుంటున్నాం. డ్రైవర్లపై కక్షపూరితంగా వ్యవహరించడం లేదు. డ్రైవర్లతో పాటు నేను కూడా ఉన్నతాధికారుల వద్దకు సమస్యను తీసుకెళ్లేందుకు సహకరిస్తాను. –తిరుపతి, భద్రాచలం ఆర్టీసీ డీఎం

కమ్యూనిజానికి అంతం లేదు..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- సురవరం సంస్మరణ సభలో పలువురి నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కమ్యూనిజానికి అంతం లేదని.. కమ్యూనిస్టులకు మరణం లేదని.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అధ్యక్షతన నిర్వహించారు. సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. సురవరం జీవితం తెరచిన పుస్తకమని, విద్యార్థి దశ నుంచే కమ్యూనిజాన్ని నమ్మి నిరంతర పోరాటాలు చేశారని కూనంనేని సాంబశివరావు కొనియాడారు. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. పదునైన ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లడమే సుధాకర్‌రెడ్డికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 2026 మార్చి వరకు మావోయిస్టులను పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడం సమంజసం కాదని, మావోయిస్టు ప్రతి రక్తపు బొట్టు నుంచి తిరిగి ఉద్భవిస్తారని వ్యాఖ్యానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కనగాల అనంతరాములు, సంకుబాపన అనుదీప్, పసుపులేటి వీరబాబు, వీరహనుమంతరావు, రామనాథం, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్యూలో చెప్పులు..



సహకార సంఘం కార్యాలయం ఎదుట క్యూలో పెట్టిన చెప్పులు

మణుగూరుటౌన్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట మంగళవారం తెల్లవారుజాము నుంచి యూరియా కోసం రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. మణుగూరు మండలానికి 60 – 70 టన్నులు యూరియా రావాల్సి ఉండగా, రెండు మూడు రోజులుగా 10 టన్నుల చొప్పున దిగుమతి అవుతోంది. అయితే మండలానికి సోమవారం 10 టన్నుల యూరియా దిగుమతి కాగా, విషయం తెలుసుకున్న రైతులు మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి చెప్పులు క్యూలో పెట్టి నిరీక్షించారు. సిబ్బంది ఉన్న యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 30 – 40 టన్నుల యూరియా మండల రైతులకు అవసరం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

పారదర్శకతకు శ్రీకారం !

- లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్
- లబ్ధిదారుడే యాప్ ద్వారా ఫొటోలు అప్‌లోడ్



సమితిసింగారంలో యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మణుగూరు టౌన్: పేదల సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టగా మొదటి విడతలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడక్కడా బిల్లుల మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ విషయంలో పారదర్శకత పాటించేందుకు లబ్ధిదారులే నేరుగా యాప్‌లో నిర్మాణ ఫొటోలు అప్‌లోడ్ చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ ప్రక్రియ సోమవారం ప్రారంభం కాగా, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, ఇబ్బంది పెట్టినా టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 5991కు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

అప్‌లోడ్ ఇలా..

లబ్ధిదారుడు తమ స్మార్ట్‌ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేశాక మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి ఓటీపీని ఉపయోగించాలి. ఇంటి నిర్మాణం ప్రతిదశలో స్పష్టమైన ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఫొటోలు ప్రభుత్వ సర్వర్‌కు చేరాక అధికారుల పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా బిల్లులు జమవుతాయి.

అక్రమాలకు చెక్..

ఇంతకుముందు మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లు, పంచాయతీల్లో కార్యదర్శులు లబ్ధిదారుల ఇంటి నిర్మాణాల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. సోమవారం నుంచి ప్రభుత్వం ఈ అవకాశం నేరుగా లబ్ధిదారులకే కల్పించడంతో అక్రమాలకు చెక్ పెట్టినట్టయింది.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం



అర్హత గలవారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం. లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఇళ్లు నిర్మించుకోవాలి. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నాం. ఎవరైనా లంచం అడిగినా, ఇబ్బందులకు గురి చేసినా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.
– శ్రీనివాసరావు, మణుగూరు ఎంపీడీఓ

యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లిన రైతు



సొమ్మసిల్లి పడిపోయిన సింగరాజు

అశ్వారావుపేటరూరల్: యూరియా బస్తాలు తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ గిరిజన రైతు సొమ్మసిల్లి పడిపోయిన ఘటన అశ్వారావుపేట మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జెట్టివారిగూడేనికి చెందిన జెట్టి సింగరాజు నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పంటకు అవసరమైన యూరియా కోసం నారాయణపురంలోని సహకార సంఘం కార్యాలయానికి సోమవారం రాగా, సిబ్బంది మంగళవారం రావాలని చెప్పడంతో వెళ్లాడు. అప్పటికే చుట్టు పక్కల గ్రామాల నుంచి మరికొందరు రైతులు రావడంతో క్యూలైన్ ఏర్పాటు చేశారు. సింగరాజు గంటకు పైగానే నిలబటంతో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. అక్కడే ఉన్న ఐరన్ కుర్చీ తగిలి చెవి భాగంలో స్వల్ప గాయమైంది. తోటి రైతులు సింగరాజును సమీపంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు.

ఎదురెదురుగా లారీలు ఢీ


ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు



జాతీయ రహదారిపై పడిన ఇనుప సామగ్రి

అశ్వారావుపేటరూరల్: ఎదురెదురుగా లారీలు ఢీకొన్న ఘటలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి టవర్లకు సంబంధించి ఇనుప సామగ్రితో వస్తున్న లారీ, ఏపీ వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న మరో లారీ అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం కాలనీ శివారులో ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్లు రాజ్‌కుమార్, తిరుమలరెడ్డి క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో ఘటన స్థలానికి వెళ్లిన సీఐ నాగరాజు, ఎస్‌ఐ అఖిల గ్రామస్తుల సహకారంతో బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, లారీలో ఉన్న ఇనుప సామగ్రి రోడ్డుపై పడిపోవడంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ఇనుప సామగ్రిని తొలగించడంతో వాహనాల రాకపోకలు సాగాయి.

కిన్నెరసాని ప్రాజెక్టు గేటు ఎత్తివేత



గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరద

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలయాశానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల వరదనీరు రావడంతో మంగళవారం నీటిమట్టం 405.40 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తివేసి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం



ట్రాక్టర్‌పై బుచ్చిరెడ్డిపాలెం వెళ్తున్న డిప్యూటీ సీఎం

ఎర్రుపాలెం: మారుమూల గ్రామాల్లోని ప్రజల అవసరాలు తీరుస్తూ, మౌలిక వసతులు కల్పించి జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో భట్టి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే 50ఏళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎర్రుపాలెం మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని అయ్యవారిగూడెం, ఎర్రుపాలెం, పెద్దగోపవరం, బనిగండ్లపాడు బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో రూ.4 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. బనిగండ్లపాడులో భోజన విరామం అనంతరం ఖమ్మం కలెక్టర్ అనుదీప్, పీఆర్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, డీపీఏ ఆశాలత, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకోబు, విద్యుత్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, తహసీల్దార్ ఉషాశారదతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఇక బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలోని ఇనద్రమ్మ చెరువును కలెక్టర్ అనుదీప్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌లతో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. అక్కడకు వెళ్లే రహదారి ఇటీవల వర్షాలతో బురదమయంగా మారడంతో ట్రాక్టర్‌పై వెళ్లారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన వివాహిత ఉద్దండుబీ కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ మంగళవారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. హోల్‌సెల్ పండ్ల వ్యాపారి అయిన భర్త నిజాంతో భార్య ఉద్దండుబీ కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాలని డిమాండ్ చేసింది. అందుకు భర్త నిరాకరించడంతో ఆమె బట్టలు సర్దుకుని వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని భర్త నిజాం భావించాడు. ఉదయం బంధువుల వద్ద ఆరా తీయగా ఆమె ఆచూకీ దొరకలేదు. భర్త నిజాం పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



ఇంటిని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని విప్పలసింగారానికి చెందిన కర్నె దిలీప్‌కుమార్ ఇంట్లోని గృహోపకరణాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. దిలీప్ కుమారుడు ఇంట్లో టీవీ చూస్తుండగా కరెంట్ పోవడంతో పక్కనే ఉన్న నాన్నమ్మ ఇంటికి ఆడుకునేందుకు వెళ్లాడు. కరెంట్ వచ్చాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, టీవీ, ఏసీ, కూలర్, దుస్తులు దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు కరెంట్ కట్ చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, వేర్పుల సురేశ్, అక్కి నర్సింహారావు, జావిద్ పాషా, పద్దం శ్రీను, రంజిత్, హర్ష, ఎం.శ్రీను,నాగయ్య, టి.శ్రీను, మణెమ్మ ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



గడ్డిమందు తాగిన యువకుడిని బైక్‌పై తీసుకెళ్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు పంట చేను వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లికి చెందిన బి.ప్రసాద్ (35) మంగళవారం పంట చేను వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఉల్వనూరు ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు లేకపోవడంతో ద్విచక్రవాహనంపై పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అంబులెన్స్ ఉండి కూడా..

కాగా, ఉల్వనూరు ఆస్పత్రిలో అంబులెన్స్ ఉన్నా దానిని నడిపే డ్రైవర్ అందుబాటులో లేడు. యువకుడు గడ్డిమందుతాగి ఆస్పత్రికి వస్తే అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు వైద్యులు కూడా లేకపోవడంతో ద్విచక్రవాహనంపై యువకుడిని సుమారు 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి తీసుకెళ్లారు. అంబులెన్స్, వైద్యులు ఉన్నా.. లేకపోయినా ఒకటేనని బాధితులు వాపోయారు. అధికారులు అంబులెన్స్ డ్రైవర్‌ను 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భారీగా గంజాయి పట్టివేత



నిందితులు, గంజాయి, వాహనాన్ని చూపుతున్న పోలీసులు

జూలూరుపాడు: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మీ పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రవితో కలిసి ఆమె వివరాలు వెల్లడించారు. మాచినేనిపేటతండా శివారులో ఎస్‌ఐ రవి, పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న బొలేరోను ఆపి తనిఖీ చేయగా 63.580 కిలోల గంజాయి దొరికింది. దీని విలువ రూ.31.79 లక్షలు ఉంటుందని, దీనిని ఒడిశా నుంచి పుణేకు అశ్వాపురం మండలం రామచంద్రాపునికి చెందిన డ్రైవర్ కె.తేజ్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన ఎల్లా భాస్కర్‌రావు పట్టుబడ్డారని సీఐ తెలిపారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన జి.నాగరాజు, మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి, ఒడిశాకు చెందిన అజాజ్ అలియాస్ అజయ్ పరారయ్యారన్నారు. బొలెరోను సీజ్ చేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీలక్ష్మీ వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుళ్లు వెంకట్, కోటేశ్వరరావు, రామకృష్ణ, సురేశ్, సూర్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తూరుబాకలో చోరీ..

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన నిమ్మకంటి కోటేశ్వరి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు సోమవారం చోరీకి పాల్పడ్డారు. కోటేశ్వరి ఖమ్మం వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి రూ.25 వేల విలువగల బంగారం, రూ.6 వేల విలువ గల కిరాణా సామగ్రి చోరీ చేయడంతో పాటు రూ.48 వేల విలువ గల టీవీని ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి 11 గంటలకు ఇంటికి చేరిన కోటేశ్వరి ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న సామగ్రిని గమనించి, చోరీ జరిగినట్లు గుర్తించి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.